సాక్షి నంద్యాల

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని నందీశ్వరునికి, బయలువీరభద్ర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.



మంచం పట్టిన ఆళ్లగడ్డ!

ఆళ్లగడ్డ పట్టణంలో అతిసారం ప్రబలింది. పలువురు వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతున్నారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

...8లో ▶



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,631.86
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 101.226
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 28,726
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 34,756

న్యూస్‌రీల్

49 రోజులు..
రూ. 35.20 లక్షలు

- మహానందీశ్వరుడి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరుడికి హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 35,20,076 ఆదాయం లభించినట్లు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహానందిలోని అభిషేక మండపంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వర, కోదండరామాలయం, ఉప ఆలయాల ద్వారా రూ. 34,11,230, అన్నప్రసాదం విభాగం ద్వారా రూ. 92,438, గోసంరక్షణ ద్వారా రూ. 16,408 వచ్చినట్లు చెప్పారు. 49 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఏఈఓ వై.మధు, అకౌంట్స్ విభాగం ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, శ్రీ భ్రమరాంబిక, తిరుమల బాలాజీ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా నదిలో పడేశారు



ఉయ్యాలవాడ వద్ద నీటిలో కొట్టుకుపోతున్న మందులు

ఉయ్యాలవాడ: కాలం చెల్లిన మందులను ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా కుందూనదిలో పడేశారు. నది పరీవాహక ప్రాంత ప్రజలు సాగు, తాగునీటిగా వినియోగించే కుందూ జలాలను కలుషితం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మందుల పంపిణీలో అలసత్వం ప్రదర్శించడంతో పాటు చివరకు నదిలో పడేసి జలచరాల ప్రాణాలకు ముప్పు వాటిల్లేగా వ్యవహరించారు. మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందే కాలం చెల్లిన మందులను కుందూలో పడవేసినట్లు తేలింది. ఈ విషయమై వైద్యాధికారి రాబర్ట్ కెనడీని వివరణ కోరగా.. తమ సిబ్బంది ఆటోలో తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కుందూ నదిలో జారి పడ్డాయని చెబుతున్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

వెలుగోడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి 9,500 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు తెలుగుగంగ ఏఈ శివ నాయక్ తెలిపారు. తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరునదికి 6 వేల క్యూసెక్కులు, మద్రాస్ కాల్వకు 3,500, వన్‌ఆర్ తూముకు 50, వన్‌ఎల్ తూముకు 30 క్యూసెక్కులు నీటిని దిగువకు పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వీబీఆర్‌లో మంగళవారం 14.725 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ తెలిపారు.

నిమజ్జనానికి పకడ్బందీ బందోబస్తు



భద్రతా ఏర్పాట్లపై పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలో బుధవారం జరిగే వినాయక నిమజ్జన కార్యక్రమానికి పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు వినాయక ఘాట్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. వినాయకుడి ప్రతిమల ఊరేగింపు సజావుగా సాగేలా ఏర్పాట్లు చేశామన్నారు. వేడుకల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మొత్తం 527 విగ్రహాలు నిమజ్జనమవుతాయని ఇందుకు కావాల్సిన క్రేన్‌లు, గజఈత గాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. భారీ విగ్రహాలను తరలించే నిర్వాహకులు విద్యుత్ తీగలను తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జన వేడుకల్లో చిన్నారులను తల్లిదండ్రులు తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్‌బీ డీఎస్పీ సంతోష్, సీఐ వలి, ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తదితరులు ఉన్నారు.



కొత్తపల్లి కస్తూర్బా పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న మురుగునీరు



జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో సరైన డైనింగ్ హాలు లేక ఆరుబయట మధ్యాహ్న భోజనానికి నిరీక్షిస్తున్న విద్యార్థులు



నంద్యాల ఎస్టీ జూనియర్ కళాశాల వసతి గృహంలో ఆరుబయట స్నానాలు చేస్తున్న విద్యార్థులు



కూలేందుకు సిద్ధంగా ఉన్న నంద్యాల బీసీ సంక్షేమ హాస్టల్‌లోని గది

సంక్షోభ హాస్టళ్లు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

కిటికీలు లేని గదుల్లో దుప్పట్లు లేక చలికి గజగజా వణుకుతూ నిద్రిస్తున్న విద్యార్థులు కొందరు.. మరుగుదొడ్లు కంపు కొడుతుండటంతో ఆరుబయట సిగ్గుతో స్నానం చేస్తున్న విద్యార్థులు మరికొందరు.. నాసిరకం భోజనంతో బక్కచిక్కిపోతున్న విద్యార్థులు ఇంకొందరు.. జిల్లాలోని ఏ హాస్టల్ చూసినా ఇదే దుస్థితి. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించేందుకు ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేరు.



బనగానపల్లె జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో ఇరుకైన గదిలో చదువులు, భోజనాలు

- కంపు కొడుతున్న పరిసరాలు
- తలుపులు లేని మరుగుదొడ్లు
- కిటికీలు లేని గదులు
- చలికి వణుకుతూ, దోమల కాటుకు గురవుతున్న విద్యార్థులు
- నాసిరకం మెనూతో బక్కచిక్కిపోతున్న బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

నంద్యాల(అర్బన్): జిల్లాలోని మొత్తం 137 సంక్షేమ వసతి గృహాలు, గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్, హాస్టళ్లలో 23,565 మంది విద్యార్థులు ఉన్నారు. అన్ని వసతి గృహాల్లో పలు సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయ్యాయి. మరుగు దొడ్లు, మూత్రశాలలను శుభ్రపరిచేందుకు సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు అలాగే వినియోగించుకుంటున్నారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి చొరవచూపడంలో విఫలమవుతున్నారు.

మరుగున పడుతున్న ఆర్వో ప్లాంట్లు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద పలు సంక్షేమ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది. పాణ్యం మండలం ఎస్సీ బాలుర వసతి గృహం, సంజామల మండలం కేజీబీవీ బాలికల విద్యాలయంలో ఆర్వో ప్లాంట్లు మరుగున పడేశారు. విద్యుత్ బిల్లులు అధికంగా వస్తుండటంతోనే ఆర్వో ప్లాంట్లను వినియోగించకుండా వదిలేసినట్లు సమాచారం. వసతి గృహాల్లో అపరిశుభ్రంగా ఉన్న చేతిపంపు, ట్యాంకుల నీటిని తాగాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు.

నాసిరకం ఆహారమే దిక్కు...

సంక్షేమ వసతి గృహాలు, గురుకుల, కేజీబీవీ వసతి గృహాల్లో నాసిరకం ఆహారాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్నారు. నిబంధనల ప్రకారం వసతి గృహాల్లో మెనూను కచ్చితంగా అమలు చేయాలి. అయితే మెనూ ఏ మాత్రం అమలు కావడం లేదు. విద్యార్థులు ఎక్కువ.. వంట మనుషులు తక్కువగా ఉండడంతో ఆహార పదార్థాల తయారీలో శుచి,రుచి కరువవుతోంది.



సంజామల కేజీబీవీ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్

ఫినాయిల్‌కు డబ్బులు లేవంట..

పలు వసతి గృహాల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు ఫినాయిల్‌ను కొనేందుకు నిధులు లేవని వార్డెన్లు గగ్గోలు పెడుతున్నారు. బడ్జెట్ ఇవ్వకపోవడంతో లైట్లు వెలగకపోయినా, స్విచ్‌లు లాంటివి రిపేరుకొచ్చినా అలాగే వదిలేస్తున్నారు.

కమీషన్ కోసం నాసిరకం కూరగాయలు

పలు వసతి గృహాల్లో వార్డెన్లు కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకం కూరగాయలను కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. మార్కెట్లో కిలో ఉల్లిపాయలు రూ.60 ఉంటే వసతి గృహాల వార్డెన్లు నాసిరకంగా విక్రయించే రూ.200కు 5 కిలోలు కొనుగోలు చేస్తున్నారు. అదేవిధంగా వంకాయ, దోసకాయ, టమాట, పచ్చిమిర్చి, తదితర కూరగాయలను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

నంద్యాల జిల్లాలో హాస్టళ్ల వివరాలు ఇలా..

హాస్టళ్లు	హాస్టళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ఎస్సీ వెల్ఫేర్	38	4,425
బీసీ వెల్ఫేర్	33	4,220
ఎస్టీ వెల్ఫేర్	13	1,900
కేజీబీవీ	27	7,110
గురుకులాలు	7	4,010
మోడల్ స్కూళ్లు	19	1,900
మొత్తం	137	23,565

మరుగుదొడ్లకు తలుపులు లేవు



వసతిగృహంలో మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లకు డోర్లు లేకపోవడంతో స్నానం చేయాలన్నా, ఒకటికి రెండుకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. అసలు ఒక్క డోరు కూడా లేకపోవడంతో బాత్‌రూమ్‌కు డోర్లు పూర్తిగా విరిగిపోయాయి. స్నానం చేసేటప్పుడు తప్పని పరిస్థితుల్లో ఒక్కోసారి అడ్డంగా రగ్గులు కట్టుకుని స్నానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి డోర్లను ఏర్పాటు చేయాలి.

– హరీష్‌కుమార్, విద్యార్థి, ఆత్మకూరు

దుప్పట్లు ఇవ్వాలి



దుప్పట్లు లేక రాత్రిపూట సరిగా నిద్ర రావడం లేదు. ఫ్యాన్ వేసుకుంటే చలి వేస్తుంది. ఫ్యాన్ ఆపేస్తే దోమలు కుడుతున్నాయి. మూడు నెలలు గడుస్తున్న దుప్పట్లు ఇవ్వలేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పటితోనే సరిపెట్టుకుంటున్నాం. ప్రభుత్వం స్పందించి దుప్పట్లు ఇవ్వాలి.

– పవన్‌కుమార్ 10వ తరగతి, బీసీ హాస్టల్, నందికొట్కూరు

జిల్లాలో పలు హాస్టళ్లలో సమస్యలు ఇలా..

- ➤ నంద్యాల బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇరుకైన అద్దె భవనంలో విద్యార్థులు వసతి పొందుతున్నారు. పాత భవనం కూలేందుకు సిద్ధంగా ఉండటం, మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు బహిర్భూమికి వెళ్లాల్సి వస్తుంది. గతంలో 450 మంది విద్యార్థులున్న హాస్టల్‌లో ప్రస్తుతం 45 మంది మాత్రమే విద్యార్థులు వసతి పొందుతున్నారు.
- ➤ 245 మంది విద్యార్థులు ఉన్న సంజామల మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మినరల్ వాటర్ ప్లాంట్ సమస్యతో స్వచ్ఛమైన తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బయట నుంచి వచ్చే వాటర్ క్యాన్లను కొనుగోలు చేస్తూ నీటిని తాగుతున్నారు. డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థినులు తరగతి గదిలో కూర్చొని భోజనాలు చేయాల్సి వస్తోంది.



నంద్యాల బీసీ వసతి గృహంలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

- ➤ కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి బీసీ బాలుర వసతి గృహం గ్రామానికి దూరంగా ఉండటంతో హాస్టల్ పరిసరాల్లో విష సర్పాలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు భయపడుతూ బయటకు రావాల్సిన పరిస్థితులు ఉన్నాయి.
- ➤ పాణ్యం మండలం ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కుళాయి నీటిని తాగుతుండటంతో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. హాస్టల్‌కు కాంపౌండ్ వాల్ లేక రాత్రి సమయాల్లో భయాందోళనకు గురి కావాల్సి వస్తుంది.
- ➤ నందికొట్కూరు పట్టణంలోని బీసీ హాస్టల్‌లో దుప్పట్లు లేక దోమలు కుడుతుండటంతో విద్యార్థులకు నిద్ర కరువవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు మాసాలవుతున్నా దుప్పట్ల పంపిణీ చేపట్టకపోవడంతో విద్యార్థులు చలిలో వణుకుతూ జ్వరాల బారిన పడుతున్నారు.
- ➤ శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల ఎస్సీ బాలుర వసతి గృహంలో 100 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్‌కు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో ఎప్పుడు ఏ సమస్య ఎదురవుతుందోనని భయాందోళన చెందుతున్నారు. హాస్టల్ సమీపంలో నివాస గృహాలు లేకపోవడంతో పాముల సంచారం అధికంగా ఉందని, సాయంత్రం సమయాల్లో సైతం బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. విద్యార్థులు వాపోతున్నారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దాం

- ఈఓ పెద్దిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో దసరా మహోత్సవాలను విజయవంతానికి కృషి చేస్తామని ఈఓ డి.పెద్దిరాజు అన్నారు. అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీశైలంలో జరిగే దసరా మహోత్సవ ఏర్పాట్లపై మంగళవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన ఈఓ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టడంలో అన్ని విభాగాలు కూడా ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలని అన్నారు. ఉత్సవాలలో స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరిపించాలని వైదిక సిబ్బందికి సూచించారు. భక్తులు ఆయా ఉత్సవ విశేషాలను వీక్షించేందుకు వీలుగా ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవం ఉట్టిపడేలా క్షేత్రంలో విద్యుద్దీపాలంకరణ, పుష్పాలంకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్థానిక పోలీసు సహకారంతో వాహనాల పార్కింగ్‌పై దృష్టి సారించాలన్నారు. డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రమణమ్మ, ఈఈలు వి.రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, తహసీల్దార్ కె.వి.శ్రీనివాసులు, సీఐ జి.ప్రసాదరావు, ఎస్పీఎఫ్ సీఐ డి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం రూపురేఖలు మారుస్తా

- కేంద్ర సహకారంతో త్వరలోనే మినీ ఎయిర్‌పోర్ట్, రైల్వేలైన్ మంజూరుకు కృషి
- శ్రీమఠం పీఠాధిపతి శ్రీసుబుధేంద్రతీర్థులు



పీఠాధిపతికి డ్రైఫ్రూట్స్‌తో తులాభారం నిర్వహిస్తున్న వ్యాపారస్తులు

మంత్రాలయం: త్వరలోనే మంత్రాలయం రూపురేఖలు మారుస్తానని శ్రీమఠం పీఠాధిపతి శ్రీసుబుధేంద్రతీర్థులు అన్నారు. మంగళవారం రాత్రి శ్రీమఠం అభిముఖంగా కొలువైన వరసిద్ధి వినాయక మండలి సభ్యులు పీఠాధిపతిని డ్రై ఫ్రూట్స్‌తో తులాభారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో త్వరలోనే మంత్రాలయానికి మినీ ఎయిర్‌పోర్ట్, మంత్రాలయం–కర్నూలు రైల్వేలైన్‌ను తీసుకొస్తానని తెలిపారు. అలాగే మంత్రాలయం గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరు సహకరించాలని త్వరలోనే ఇక్కడ మురికి కాల్వల నిర్మాణ, రోడ్ల విస్తరణ తదితర పనులు చేపడతామన్నారు. అదే విధంగా కారిడార్ నిర్మాణ సమయంలో వ్యాపారులు ఇబ్బంది పడిన నేపథ్యంలో నెలన్నర అద్దె మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు వరసిద్ధి వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత గిరిరాజాచార్, శ్రీమఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, వేదపాఠశాల ప్రిన్సిపాల్ వాదిరాజాచార్, వ్యాపారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకోవాలి

- దిశ కమిటీ చైర్మన్ బైరెడ్డి శబరి



మాట్లాడుతున్న ఎంపీ శబరి, చిత్రంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

నంద్యాల(అర్బన్): జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ఎంపీ, జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశ) కమిటీ చైర్మన్ బైరెడ్డి శబరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో నిర్వహించిన జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశానికి ఎంపీతో పాటు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఎంపీపీలు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 25 శాఖలకు సంబంధించి 43 సంక్షేమ పథకాల కింద మంజూరు చేసిన పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కేంద్రం నుంచి విడుదలైన ప్రతి రూపాయిని సక్రమంగా సద్వినియోగం చేసుకొని జిల్లా ప్రజలకు మేలు చేసేలా అందరం కలిసికట్టుగా పనిచేసి నంద్యాల జిల్లాను రోల్ మోడల్‌గా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. నందికొట్కూరు, పాములపాడు, బనగానపల్లె, సంజామల తదితర మండలాలలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిధులను సక్రమంగా వినియోగించుకొని రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు.

- జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల అమలును పటిష్టవంతంగా చేపట్టి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 70వేల హెక్టార్లలో రైతులు మోనోక్రాపింగ్ పంటలకే పరిమితమై 9 నెలల కాలం పంట పొలాలను నిరుపయోగంగా ఉంచుతున్నారన్నారు. జిల్లాలో 400 హెక్టార్ల ఆయిల్ పామ్ సాగు లక్ష్యం కాగా 100 హెక్టార్లలో సాగు చేశారన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు మంచి అవకాశాలు ఉన్నాయని, ప్రతి హెక్టార్‌కు రూ.71వేలు సబ్సిడీ వస్తుందన్నారు. జిల్లాలో 37 ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకులకు నిచ్చెనలు లేవని జడ్పీ నిధుల నుంచి ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి బయో వేస్టేజ్ డీటెయిల్ రిపోర్ట్ ఇవ్వాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద కొత్త స్కీముల ద్వారా ట్యాపులు మంజూరు చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకుల స్థానంలో కొత్తవి నిర్మించాలన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ శాఖల ప్రగతిని వివరించారు.

పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్ పూర్తి

కర్నూలు(హాస్పిటల్): పారామెడికల్ కోర్సులకు 2024–25 సంవత్సరానికి సంబంధించి మొదటి విడతలో వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి మంగళవారం రెండో కౌన్సెలింగ్ పూర్తి చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ తెలిపారు. కౌన్సెలింగ్ కమిటీ ఆధ్వర్యంలో మెరిట్, రోస్టర్ ప్రకారం మిగిలిన సీట్లను భర్తీ చేశామన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఏ కారణం చేతనైనా ఫీజు చెల్లించకపోతే సదరు కోర్సు సీట్లను ఈ నెల 17వ తేదీన జరిగే మూడో కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. హరిచరణ్, డాక్టర్ టి. సాయిసుధీర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఓ ఎస్.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఇద్దరు సస్పెన్షన్

బనగానపల్లె: బనగానపల్లె మండల ఈఓఆర్‌డీగా పని చేస్తూ మెడికల్ లీవ్‌లో ఉన్న శివరామయ్య, బనగానపల్లె మండలం అప్పలాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఖలీల్ బాషాను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కృష్ణతేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శివరామయ్య ఎన్నికల ముందు బనగానపల్లె మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా, ఖలీల్‌బాషా బనగానపల్లె పట్టణ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేశారు. ఆ సమయంలో వీరు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లేఅవుట్లకు అనుమతులు ఇవ్వ డంతో పాటు ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు వైఎస్ చైర్మన్ ఫిర్యాదుతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఆర్‌యూ లా సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం లా 5,7,9 సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉస్మానియా కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షల కేంద్రాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లుతో కలిసి వర్సిటీ వీసీ, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణలో పరీక్షలు నిర్వహించాలని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈనెల 20వ తేదీ వరకు రోజు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని, ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షలకు 315 మంది విద్యార్థులకు 301 మంది, మధ్యాహ్నం సెషనలో జరిగిన పరీక్షలకు 56 మందికి గాను 48 మంది హాజరయ్యారని రిజిస్ట్రార్ తెలిపారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


నిర్మల్‌బాబు (ఫైల్)

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని ఓ డాబాలో పని చేస్తున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శెట్టివీడు పంచాయతీ మజరా గ్రామమైన జ్ఞానాపురం గ్రామానికి చెందిన రూబెన్, సుజాత దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు నిర్మల్‌బాబు (20) కొంత కాలంగా చాగలమర్రిలోని ఎస్‌కేఆర్ డాబాలో పని చేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం డాబాకు అవసరమైన సరుకులు, కూరగాయలు ఈ యువకుడే తీసుకొచ్చేవాడు. మంగళవారం ఉదయం యజమాని కృష్ణారెడ్డి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అనుమానంతో ఆయన డాబా వద్దకు వచ్చి చూడగా గదిలో నిర్మల్‌బాబు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. పోలీసుల సమక్షంలో గది తలుపులు పగులగొట్టి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. అప్పులబాధతో తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ షేక్ అబ్దుల్ నబీ తెలిపారు.

విద్యుత్ కార్యాలయం ఎదుట భక్తుల ఆందోళన


ధర్నా చేస్తున్న భక్తులు

నందికొట్కూరు: వినాయక మండపాలకు విద్యుత్ వినియోగానికి అధిక మొత్తం డిమాండ్ చేయడంతో హిందూ సంఘాల నాయకులు, భక్తులు ఆందోళకు దిగారు. జీఓ ప్రకారం రూ.500 చెల్లించాల్సి ఉండగా రూ.1,100 డిమాండ్ చేయడంతో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని నిలదీస్తూ స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు,రంగస్వామి, ఆర్ట్ శ్రీనివాసులు మాట్లాడుతూ రూ.1,100 చెల్లించకపోతే ఐదు వేలు ఫైన్ వేస్తామంటూ బెదిరించడం తగదన్నారు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మండపాల వద్దకు వెళ్లిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అధికమొత్తంలో డిమాండ్ చేయడం దుర్మార్గమన్నారు. రూ.1100 చెల్లించాలని జీఓ ఎక్కడ ఉందో చూపించాలని భక్తులు తిరగబడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వినాయక భక్తుల నుంచి అధికంగా పైసలు వసూలు చూస్తే సహించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అనంతరం దిగ్గొచ్చిన విద్యుత్ శాఖ ఏడీఏ శ్రీనివాసులు మాట్లాడుతూ జీఓ ప్రకారం చలానా కట్టాలని వినాయక భక్తులకు సూచించారు. ధర్నాలో రాఘవ, ఈశ్వర్, శివ, రాఘవేంద్ర, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 34 ఓపెన్ స్కూళ్లు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో 34 ఓపెన్ స్కూళ్ల కేంద్రాలు ఉన్నాయని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీ నారాయణ మంగళవారం తెలిపారు. నంద్యాలలోని బాలికల ఉన్నత పాఠశాల, ఎస్పీజీ, మున్సిపల్ హైస్కూల్‌తో పాటు ప్రతి మండల కేంద్రంలో ఓపెన్ స్కూల్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. చదువు మధ్యలో నిలిపేసిన వారు ఓపెన్ స్కూల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే ఓపెన్ స్కూల్ కేంద్రాలు ఉన్నాయని, ప్రైవేటు పరిధిలో ఇంత వరకు ప్రారంభం కాలేదని వివరించారు.

గురుకులానికి సెలవు

ఇది పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల. ఇందులో 280 మంది బాలికలు వసతి పొందుతున్నారు. శనివారం రాత్రి పాఠశాలలో ఐదుగురికి వాంతులు, విరేచనాలు అవుతున్నాయని వైద్యశాలకు వెళ్లి వచ్చేలోపు మరో 20 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వైద్యశాలకు తరలించిన కొన్ని గంటలకే సుమారు వంద మందికి పైగా ఇదే లక్షణాలు కనిపించడంతో సోమవారం పాఠశాలకు సెలవు ప్రకటించి బాలికలను వారి గ్రామాలకు పంపించారు.


గురుకుల పాఠశాల



ఇక్కడ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి పేరు ప్రసాద్. ఎస్వీ నగర్‌కు చెందిన ఇతను మంగళవారం ఉన్నట్టుండి వాంతులు, విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అతిసార సోకిందని నిర్ధారించి చికిత్స చేస్తున్నారు.


చికిత్స పొందుతూ మృతి చెందిన ఇమాంబీ

ఈమె పేరు ఇమాంబీ. పట్టణంలోని చాంద్‌వీధికి చెందిన ఈ మహిళ రెండురోజుల క్రితం వాంతులు, విరేచనాలకు గురైంది. కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయించినప్పటికీ కోలుకోలేక సోమవారం మృతి చెందింది.

మంచం పట్టిన ఆళ్లగడ్డ!

- ప్రబలిన అతిసారం
- వాంతులు, విరేచనాలతో వందలాది మంది అస్వస్థత
- గురుకుల పాఠశాల విద్యార్థులకు సోకిన డయేరియా
- కిటకిటలాడుతున్న వైద్యశాలలు
- తాగునీటిలో తోక పురుగులు, దుర్వాసన
- చోద్యం చూస్తున్న మునిసిపల్ అధికారులు


ఆళ్లగడ్డ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు


చికిత్స కోసం వేచి ఉన్న రోగులు

ఆళ్లగడ్డ: అతిసారం విజృంభిస్తోంది.వాంతులు, విరే చనాలతో జనం అల్లాడుతున్నారు. ఆళ్లగడ్డలో ఈ పరిస్థితి మరి తీవ్రంగా ఉంది. వారం రోజుల్లో వందలాది మంది మంచం పట్టారు. రెండురోజుల క్రితం కోలుకోలేక ఓ మహిళ సైతం మృతి చెందారు.పట్టించుకోవాల్సిన అధికారులు కలుషిత నీరు, అపరిశుభ్ర వాతావరణమే దీనికి ప్రధాన కారణమని చేతులు దులుపుకుంటున్నారు.

కనిపించని ముందుస్తు ప్రణాళిక

సాధారణంగా వర్షాకాలంలో తాగునీరు కలుషితమవుతుంటోంది. ఈ విషయం తెలిసినా అధికారులు నిర్లక్ష్యం వహించారు. మున్సిపల్, ఆరోగ్య శాఖల మధ్య సమన్వయం కొరవడటంతో పాటు ముందస్తు ప్రణాళిక లేక పోవడంతోనే ఆళ్లగడ్డలో అతిసారం ప్రబలిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనేక చోట్ల డ్రైనేజీల్లోనే తాగు నీటి పైపులు ఉండటం, అవి లీకేజీ అవుతుండటంతో నీరు కలుషితమవుతుంది. దీనిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. మరోవైపు పట్టణంలో పారిశుద్ధ్యం లోపించింది. మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా లేదు. ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి.

ఒక్క రోజే వందలాది మందికి

గత వారం రోజుల క్రితం పట్టణంలోని చాంద్‌వీధిలో మొదలైన అతిసార రోజురోజుకు పెరుగుతూ దాదాపు పట్టణం అంతా సోకింది. సోమవారం ఒక్క రోజే పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో వందలాది మంది రోగులు వైద్యపరీక్షలు నిర్వహించుకుని చికిత్స పొందుతున్నారు. తీవ్రత ఉన్నవారికి వైద్యశాలలో వైద్యం అందిస్తుండగా మిగతా వారికి మందులిచ్చి పంపిస్తున్నారు.

మంచినీటి కులాయిల్లో మురుగు నీరు

మంచినీటి పైపులైన్లు పలుచోట్ల లీకేజీ అయి తాగునీరు కలుషితమవుతుంది. కొన్ని కాలనీల్లో సరఫరా అవుతున్న నీటిలో మురుగునీటితో పాటు తోక పురుగులు వస్తున్నాయి. మరికొన్ని చోట్ల నీటిలో దుర్వాసన వస్తుండటంతో వాటిని తాగేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లితే అందరూ ఫిల్టర్ వాటర్ కొనుక్కొనే కదా తాగేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నట్లు అతిసార బాధితులు వాపోతున్నారు.


మంచినీటి కుళాయిలో వచ్చిన మురుగు నీరు

పిల్లలను ఇంటికి పంపించాం



శనివారం రాత్రి ఐదుగురు పిల్లలు ఒకేసారి అస్వస్థతకు గురవడంతో వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తుండగానే మరికొందరికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. అలా మొత్తం 280 మందికి సోకడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. వారి ఆదేశాలతో సెలవు ఇచ్చి అందరినీ వారి ఊర్లకు పంపించడం జరిగింది.

– జాన్సీరాణి, ప్రిన్సిపాల్, బీసీ బాలికల గురుకుల పాఠశాల

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు



పట్టణంలో విజృంభిస్తున్న అతిసారను అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మంచినీటి పైపుల లీకేజీలను గుర్తించి వాటికి మరమ్మతులు చేయిస్తున్నాం. 5 ప్రదేశాల్లో పాత పైపులను తొలగించి కొత్త పైపులను ఏర్పాటు చేశాం. ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన నీటినే వదులుతున్నాం. అలాగే పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశాం.

– సురేంద్రరెడ్డి, ఏఈ

జీవితంలో ప్రశాంతత ముఖ్యం


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.భాస్కర్, ట్రిపుల్‌ఐటీ డీఎం రిజిస్ట్రార్ గురుమూర్తి

కర్నూలు సిటీ: మనిషి శారీరకంగా ఎంత ఆరోగ్యంగా ఉన్నా ప్రశాంతత ముఖ్యమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.భాస్కర్ అన్నారు. మంగవారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్‌ఐటీడీఎం)లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్, ట్రిపుల్ ఐటీడీఎం రిజిస్ట్రార్ గురుమూర్తి ప్రసంగించారు. ప్రశాంతత లేక చాలా మంది దీర్ఘకాలిక రుగ్మతల బారిన పడుతుంటారన్నారు. విపరీతమైన ఆలోచనలు ఆత్మహత్యకు ప్రేరేపిస్తాయన్నారు. మానసిక ఆరోగ్య జబ్బులపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతోనే ఆ ప్రభావం సమాజంపై పడుతుందన్నారు. నిద్రలేమి, అతినిద్ర, ఒంటరితనం, పరిస్థితులకు తగ్గట్టు సర్దుబాటు కాలేకపోవడం వంటి సమస్యలతో బాధపడేవారిని సకాలంలో వైద్యుల దగ్గరికి తీసుకెళ్లాలన్నారు. మానసిక వైద్యులు డా.చైతన్య మట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని, ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చునని చెప్పారు. అనంతరం మానసిక ఆరోగ్య సమస్యల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డీఎం అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డోలమైట్ పౌడర్ లారీ సీజ్

కర్నూలు(న్యూసిటీ): డోన్ నుంచి బెంగళూరుకు అక్రమంగా డోలమైట్ పౌడర్‌ను తరలిస్తున్న లారీని మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో అధికారులు డోన్ పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. డోలమైట్ లారీ రాగానే గుర్తించి సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేపట్టినట్లు మైనింగ్ శాఖ డీడీ భాస్కర్ తెలిపారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ బాలునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సీ ప్లేన్‌తో పర్యాటక అభివృద్ధి


శ్రీశైలం డ్యాం బ్యాక్‌వాటర్‌లో బోటులో ప్రయాణిస్తున్న ఇంజనీర్లు

శ్రీశైలం టెంపుల్: సీ ప్లేన్‌తో పర్యాటకంగా కూడా శ్రీశైలం మరింత అభివృద్ధి చెందుతుందని సీప్లేన్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు మేనేజర్ అమృత్‌కుమార్ తెలిపారు. మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు అమృత్‌కుమార్‌తో పాటు టూరిజం జీఎం నాగేశ్వరరావు, డీఎం చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో దాసు, ఫిషరీస్ జేడీ రాఘవరెడ్డి, శ్రీశైలం తహసీల్దార్ కెవి.శ్రీనివాసులు, శ్రీశైలం టూరిజం మేనేజర్ పెంచల్‌రెడ్డిలతో కూడిన బృందం శ్రీశైలంలో పర్యటించారు. రోప్‌వే నుంచి పాతాళగంగ చేరుకున్న బృందం బోటు సహాయంతో కృష్ణానదిలో కలియతిరిగారు. శ్రీశైలం నుంచి డ్యాం, బ్యాక్ వాటర్, తెలంగాణపరిధిలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వరకు బోటులో ప్రయాణించి సీ ప్లేన్ విధానంలో ఏరోడ్రోమ్ నిర్మాణానికి సర్వే చేశారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద నుంచి శ్రీశైల జలాశయం వరకు నది ఉపరితల భాగాన్ని పరిశీలించారు. ఆయా ప్రదేశాలు అనుకూలంగా ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో పలు విషయాలపై ఎయిర్‌పోర్టు ఇంజనీర్ చర్చించారు. ఈ ప్రాంతం ఏరోడ్రోమ్ ఏర్పాటుకు అనుకూలంగా ఉందని ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు మేనేజర్ అమృత్‌కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సీ ప్లేన్ ద్వారా దేశ, విదేశాల నుంచి పర్యాటకులు శ్రీశైలం వచ్చేందుకు వీలుంటుందన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీలో గోల్‌మాల్

- బుక్ కీపర్ రూ.4.50 లక్షలు స్వాహా
- పొదుపు సభ్యుల నిలదీత
- అప్పటికప్పుడు రూ.2.50 లక్షలు చెల్లింపు
- మిగతా సొమ్ము చెల్లింపునకు నెల రోజుల గడువు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు


విచారణ చేపట్టిన డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది

జూపాడుబంగ్లా: పొదుపు గ్రూపు సభ్యులు చెల్లించిన రుణ కంతుల నిధులను బ్యాంక్‌లో జమ చేయకుండా బుక్ కీపర్ స్వాహా చేసిన ఘటన జూపాడుబంగ్లాలో చోటు చేసుకుంది. దాదాపు రూ. 4.50 లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు అధికారుల విచారణలో తేలింది. అరుణోదయ గ్రామైక్య సంఘంలో 36 గ్రూపుల్లో 121 మంది పొదుపు మహిళలు ఉన్నారు. వీరంతా 1.98 కోట్ల మేర రుణాలు తీసుకొన్నారు. వారు తీసుకొన్న రుణాల మొత్తాన్ని ప్రతి నెల గ్రామైక్యసంఘం కార్యాలయంలో బుక్‌కీపర్ జ్యోతికి చెల్లించి రసీదు పొందారు. వారికిచ్చిన రసీదులోని మొత్తం, వారి స్త్రీనిధి బ్యాంకు ఖాతాల్లో జమచేసిన మొత్తంలో వ్యత్యాసం ఉండటాన్ని గమనించిన పొదుపు మహిళలు నెలరోజుల క్రితం ఏపీ డేగలయ్య, ఏపీఎం అంబమ్మ, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఆయా సంఘాలకు రూ.70.20 లక్షల స్త్రీనిధి రుణాలు ఇవ్వగా బుక్‌కీపర్ జ్యోతికి నెలవారి కంతులుగా రూ.38.95 చెల్లించారు. అయితే బ్యాంక్‌లో రూ.34,43,274లు మాత్రమే జమచేసినట్లు అధికారుల విచారణలో తేలింది. మిగిలిన రూ.4.51 లక్షలు దుర్వినియోగం చేసింది. ఆ మొత్తాన్ని బుక్‌కీపర్ వారి బంధువులు రెండేళ్ల నుంచి స్త్రీనిధి రుణాల మొత్తాలను చెల్లించకపోయినా వారి బ్యాంకు ఖాతాలకు జమచేసినట్లు విచారణలో వెలుగు చూసింది. వారితో మాట్లాడి వారి నుంచి రూ.2,50,210లు గ్రామైక్య సంఘానికి కట్టించారు. మిగిలిన రూ.2,01,552లను బుక్‌కీపర్ జ్యోతి బకాయి పడింది. ఈ మొత్తాన్ని నెలరోజుల్లోగా చెల్లిస్తానని ఒప్పుకుంది. అయితే కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో బుక్‌కీపర్‌పై ఫిర్యాదు చేసినట్లు ఏపీఎం అంబమ్మ తెలిపారు.

అధికారుల పాత్రపై అనుమానం..

బుక్ కీపర్ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నా అధికారులు గుర్తించకపోవడంతో పొదుపు గ్రూపు సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిధుల స్వాహాలో వారి పాత్ర ఉందేమోనని చర్చించుకుంటున్నారు. తాము జమ చేసిన డబ్బులు, రసీదులకు తేడా వస్తుండటంతో నెల క్రితం ఫిర్యాదు చేసినా విచారణ చేయడంలో అధికారులు జాప్యం చేసినట్లు తెలుస్తోంది. మంగళవారం జరిగిన విచారణలో కూడా బుక్‌కీపర్ జ్యోతికి వత్తాసు పలికేలా ఏపీఎం అంబమ్మ వ్యవహరించడంతో పొదుపు మహిళలుమండిపడ్డారు. మిగిలిన రూ.2,01,536ల మొత్తాన్ని చెల్లించే వరకు తాము స్త్రీనిధి రుణాల నెలవారి కంతులను చెల్లించమని తెగేసి చెప్పారు. బుక్‌కీపర్‌ను తొలగించాలని గ్రామైఖ్యసంఘం తరుపున పొదుపు మహిళలు తీర్మానం చేశారు. అలాగే మొక్కజొన్నల కొనుగోలు కమీషన్ రూ.4 లక్షలు, వాటర్‌షెడ్ నిధులు రూ.10 లక్షల స్వాహాపై సమగ్ర విచారణ చేపట్టాలని వారు జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ONE SITTING

■ ONE SITTTING: 10th, 12th, BA, B.Com., B.Sc, M.A., M.Com., M.Sc., MBA, BBA, BCA, B.Tech, D.Ed, B.Ed, Agriculture, Pharmacy, Nursing (For Dropouts / Back Logs) From Recognised Universities, Exams in Sep/Oct. Cont : 73383 76874 [R-736]

REAL ESTATE

PLOT FOR SALE

■ నంద్యాలలో విజయ డైరీ దగ్గర ఇల్లు కట్టుకోవడానికి అన్ని వసతులతో వెంచర్ నందు ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్రదించండి: 62811 96419. [L-783327]

LEASE / RENT

■ కర్నూలు ఎస్.ఆర్.పేట రోడ్ నెం: 6 తుంగభద్ర హాస్పిటల్ ఎదురుగా 2500 Sqft కమర్షియల్ Space లీజుకు/అద్దెకు ఇవ్వబడును. సం.ప్ర: 89199 89070. [L-794923]

SERVICES

HEALTH CARE

■ FREE MEDICAL CAMP: 40సం॥లు పైబడిన మగ వారికి "సుశ్రుత స్పెషాలిటీ హాస్పిటల్స్" వారి సౌజన్యంతో ఈ నెల 07.09.24 నుండి 30.09.24 వరకు Prostate Awareness ఉచిత క్యాంప్ నిర్వహించబడును. కావున కర్నూలు ప్రజలు తమ పేర్లను నమోదు చేయించుకోవలసినదిగా కోరడమైనది. ప్రతి రోజు కేవలం 10 ఓ.పి.లు మాత్రమే ఫ్రీగా చూడబడును. డాక్టర్ కన్సల్టేషన్ & యూరోఫ్లోమెట్రీ పరీక్షలు కూడా ఉచితంగా చేయబడును. డా॥శివశంకర్ రెడ్డి, M.ch, యురాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్, సుశ్రుత స్పెషాలిటీ హాస్పిటల్, నియర్ గౌరీగోపాల్ హాస్పిటల్, బుధవారపేట, కర్నూలు. సెల్: 9052829255, 8074190584. [L-783318]

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్ బిజినెస్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రాపర్టీలోన్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీతం+ కమీషన్. ఫోన్ : 7015882322 [SCA-24000239]

WANTED

■ నంద్యాల జిల్లాలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఏజెంట్స్, టెలికాలర్స్, టీమ్ లీడర్స్ కావలెను. జీతం:10 to 15K సం.ప్ర: 96405 99980. [L-783326]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Fixed Salary+Monthly Gifts+Attractive Incentives. Join With us for Bright Future and Unlimited Income. Cont: 91827 58409. [L-783325]

■ అగ్రికల్చర్‌కు సంబంధించిన ప్రాజెక్ట్ నందు పనిచేయుటకు Dist - Co.ordinators, Mandal PRO's కావలెను. Q: 10th ఆపైన M/F. సం.ప్ర॥ ✆ 86885 07055, 79892 55044 [O-190030]

■ మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 56208 [V- 6557]

■ శ్రీ లక్ష్మీ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులకు పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం: 17,000/- రూం+మీల్స్ ఫ్రీ. 9347148051 [G-2162]

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను,చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640528899, 9640648899 [H-796196]

■ కన్సల్టెన్సీ కాదుVIPఇండ్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. 9182260297. [HA-98406]

■ E.Kart నందు Urgent గా స్త్రీ/పు॥ కావలెను. Inter, Any Degree. Salary: 14,500/- Online are available. Cell: 9014547408,9666275640. [W-1239978]

■ నవ్య సాయి ప్రాజెక్ట్స్‌లో ఎర్ర చందనం వ్యవసాయం క్షేత్రంలో అసోసియేట్స్‌గా పని చేయుటకు మరియు పెట్టుబడి పెట్టుటకు కస్టమర్స్ కావలెను. మా ఆఫీసు కర్నూలులో ఆఫీసు ప్రారంభం 12/9/24. సంప్ర: 7893644509 [SCA24000241]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

కర్నూలు సిటీ: సుంకేసుల బ్యారేజీకి ఎగువ నుంచి వరదనీటి ప్రవాహం తగ్గింది. బ్యారేజీకి 36,0 78 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 8 గేట్లు పైకెత్తి 33,633 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. మరో 2,445 క్యూసెక్కులు కేసీకి విడుదల చేస్తున్నారు.

సోదరభావంతో మెలగాలి

- కలిసిమెలసి పండుగలు నిర్వహించుకోవాలి
- పీస్ కమిటీ సమావేశంలో ఎస్పీ బిందు మాధవ్


మతపెద్దలతో ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: సంప్రదాయాలను గౌరవిస్తూ.. సోదర భావంతో మెలుగుతూ పండుగలు జరుపుకోవాలని ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. ఈనెల 15న వినాయక నిమజ్జనం, 16వ తేదీన మిలాద్ ఉన్ నబీ పండుగలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. నగరంలోని వివిధ వర్గాలకు చెందిన సామాజిక మత పెద్దలు, జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కర్నూలు జిల్లా మతసామరస్యానికి ప్రతీక అని, దీనిని కొనసాగించాలని చెప్పారు. వినాయక నిమజ్జనోత్సవం ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. సంప్రదాయంగా భక్తి వాతావరణంలో వినాయక నిమజ్జనం ఉండాలన్నారు. కర్నూలు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ శాఖ తరపున నిమజ్జనం రోజు 480 మంది శానిటరీ సిబ్బందిని పారిశుధ్య కార్యక్రమాలకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ బార్లు, మద్యం షాపులు నిమజ్జనం రోజున మూయించాలని, అశ్లీల నృత్యాలు రికార్డింగ్ డ్యాన్సులు జరగకుండా చూడాలని కోరారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు ప్రసాద్, కేశవరెడ్డి, పవన్ కిషోర్, రామయ్య నాయుడు, నాగరాజరావు, మురళీధర్‌రెడ్డి, మధుసూదన్ గౌడ్, మన్సురుద్దీన్, శ్రీధర్‌తో పాటు మత పెద్దలు, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ అబ్దుల్ సలాం, మౌలానా అబ్దుల్ ఖదీర్, ప్రతాప్‌రెడ్డి, పూల రంగస్వామి, పర్వేజ్, మహమ్మద్ పీర్, మద్దిలేటి, వేణుగోపాల్ జోగయ్య శర్మ, అబ్దుల్ రజాక్, విద్యుత్, అగ్నిమాపక, దేవదాయ పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీపై హత్యాయత్నం

- పొలం విషయంలో గొడవ
- కత్తితో పొడిచి పరార్


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంగమ్మ

కోసిగి: కోసిగి మండల వైఎస్సార్‌సీపీ మహిళ నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు దళవాయి మంగమ్మపై అదే గ్రామానికి చెందిన కురువ మల్లయ్య అనే వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్ద ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మంగమ్మ ఉరుకుంద రోడ్డులో నాలుగు దుకాణాల కాంప్లెక్స్ ఏర్పాటు చేసుకుని వెనుక భాగంలో పొలం సాగు చేసుకుంటుంది. ఆమె పక్కనే కురువ మల్లయ్య భూమి కూడా ఉంది. గతంలో కలిసిమెలసి ఉన్న ఈ ఇద్దరికీ పొలం విషయంలో మనస్పర్థలు తలెత్తాయి. ఇది కాస్త గొడవలకు దారి తీసింది. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్ద ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఈ క్రమంలో మల్లయ్య వెంట తెచ్చుకున్న కత్తితో మంగమ్మ కడుపుపై పొడిచేశాడు. పక్కనే ఉన్న ఆమె మనవడు, స్నేహితురాలు ఈరమ్మ అడ్డు పడడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. తర్వాత గాయపడిన ఆమెను కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి బాధితురాలి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పార్టీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని ఆమెను పరామర్శించారు. హత్యాయత్నంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కోసిగి ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ


త్రిలేఖ

డోన్ టౌన్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, జాతీయ సిల్క్ బోర్డు సంస్థలు సంయుక్త నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో జగదుర్తి గ్రామానికి చెందిన దుర్గం త్రిలేఖ సెరికల్చర్ విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో 480 మార్కులకు గాను 301 మార్కులు సాధించి సత్తా చాటింది. మహానంది వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ, బెంగళూరులోని జీకేవీకేలో ఎంఎస్ పూర్తి చేసిన త్రిలేఖ శాస్త్రవేత్తగా రాణించాలనే లక్ష్యంతో పట్టుదలతో చదివి ప్రతిభ చాటింది.